సమర్థవంతమైన సేవలందిస్తాం

2024 సంవత్సర క్రైమ్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, పోలీస్ అధికారులు

- జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు
- 2024లో 5919 కేసులు, 28 హత్యలు
- 373 చోరీలు, రూ. 2.48 కోట్ల సొత్తు అపహరణ
- రూ. 76.76 లక్షల సొత్తు రికవరీ
- క్రైమ్ మీట్‌లో ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 26: ప్రజల సహకారంతో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో మరింత సమర్థవంతమైన సేవలందిస్తామని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం 2024 సంవత్సర క్రైమ్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో కేసుల నమోదు సంఖ్య పెరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2023 సంవత్సరంలో 4999 కేసులు నమోదు కాగా, 2024లో 5919 కేసులు నమోదయ్యాయని, గతేడాదితో పోలిస్తే కేసుల నమోదు 18.40 శాతం పెరిగిందన్నారు. జిల్లాలో అత్యధికంగా జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో 791, తక్కువగా బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో 120 కేసులు నమోదయ్యాయన్నారు. జిల్లాలో 28 హత్యలు, 373 దొంగతనాలు జరుగగా, రూ. 2.48 కోట్ల సొత్తును దొంగలు దోచుకెళ్లగా, ఇప్పటి వరకు రూ. 76 లక్షల సొత్తు రికవరీ చేశామన్నారు. జగిత్యాల పాత బస్టాండ్ వద్ద ఓ మహిళ నుంచి 37 తులాల బంగారం చోరీ చేసిన ముఠా, బీర్‌పూర్ దోపిడీ ముఠాలను కేవలం వారం రోజుల వ్యవధిలోనే పట్టుకున్నామన్నారు. మహిళలపై అఘాయిత్యాలు సైతం తగ్గాయన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న 702 మందిపై కేసులు నమోదు చేసి, 475 వాహనాలు సీజ్ చేశామన్నారు. 602 మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి, రూ. 19.40 లక్షల సొత్తు రివకరీ చేశామన్నారు. 7058 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, వీరిలో చాలా మందికి కోర్టు జైలు శిక్ష సైతం విధించినట్లు తెలిపారు. పోలీసులు వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన రోడ్ సేఫ్టీ చర్యలతో రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గిందన్నారు. అధిక వడ్డీ వసూలు, ఆన్‌లైన్ బెట్టింగ్, మనీ యాప్‌ల పేరుతో ప్రజలను చీట్ చేసిన వారిపై 29 కేసులు నమోదు చేశామన్నారు. విదేశాలకు పంపిస్తామంటూ మోసం చేసిన 31 మంది నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై కేసులు నమోదు చేశామన్నారు. 70 మందిపై మిస్టరీ షీట్స్, వీరిలో 37 మందిపై రౌడీ షీట్లు తెరిచామని, ఇద్దరిపై పీడీ యాక్టు నమోదు చేశామన్నారు. గత ఆగస్టులో మెట్‌పల్లిలో రెండేళ్ల బాలుడు కిడ్నాప్‌కు గురికాగా, కేవలం 16 గంటల్లో ఛేదించి బాలుడిని తల్లి దండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. మెట్‌పల్లిలో బైక్ దొంగలను అరెస్టు చేసి, 20 ద్విచక్రవాహనాలను రికవరీ చేశామన్నారు. 1289 సైబర్ క్రైమ్స్ కేసుల్లో రూ. 8.58 కోట్లు నష్టపోగా, రూ. 1.12 కోట్లు రికవరీ చేశామన్నారు. షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, కళాబృందాలతో మహిళలపై అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్స్, గల్ఫ్ చీటింగ్, మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో 10 కేసుల్లో జీవిత ఖైదు, 11 మందికి 5–10 సంవత్సరాల జైలు శిక్షను కోర్టులు విధించాయన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం హెల్త్ క్యాంపులు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎస్పీ రఘుచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ అలీఖాన్, ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్, నీలం రవి, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

మెట్‌పల్లి, డిసెంబర్ 26: పల్లె లేదు.. పట్టణం లేదు ఊరూరా బెల్టుషాపులు, ప్రధాన రహదారుల వెంబడి దాబా హోటళ్లు.. వెరసి మద్యం అక్రమ అమ్మకాల దందా జోరుగా సాగుతున్నది. నెలవారీగా ప్రభుత్వం పెట్టిన మద్యం అమ్మకాల లక్ష్య ఛేదన పేరిట ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ అధికారులు, మరో వైపు అప్పుడప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారాలు ఉపయోగించే పోలీస్ అధికారులు మిన్నకుండి పోతున్నారు. మద్యం అక్రమ అమ్మకాలు, దాబా హోటళ్లలో అక్రమ సిట్టింగులు జరుగుతున్నా ఎక్సైజ్, పోలీస్ అధికారులు మాత్రం 'మాములు' గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోకి మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలతో పాటు ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్ మండలాలు వస్తాయి. ఈ సర్కిల్ పరిధిలో 26 లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు ఉండగా, అనుబంధంగా 220కి పైగా బెల్టుషాపులు ఉన్నవి. బెల్టుషాపులకు ఎలాంటి లైసెన్స్ ఉండదు. కానీ, లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలకు తీసిపోని విధంగా యథేచ్ఛగా మద్యం విక్రయాలు బెల్టుషాపుల ద్వారా జరుగుతున్నాయి. అదే విధంగా ఒక్కో మద్యం దుకాణానికి అనుబంధంగా కనీసం 10 నుంచి 15 బెల్టు షాపులు ఉన్నవి. వాటికి మద్యం పెద్ద ఎత్తున లైసెన్స్‌డ్ మద్యం దుకాణం నుంచి సరఫరా అవుతున్నది. ఇదిలా ఉండగా మద్యం ప్రియుల సిట్టింగ్‌లకు 48కి పైగా దాబా హోటళ్లు నడుస్తున్నాయి. ప్రధానంగా నిజామాబాద్, నిర్మల్, రాజన్నసిరిసిల్ల జిల్లాలకు సరిహద్దులో ఉన్న మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్ మండలాల్లో ప్రధాన రహదారుల వెంబడి ఈ దాబా హోటళ్లు నిత్యం మందు బాబులతో సందడిగా ఉంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి దాబా హోటళ్లు, బెల్టు షాపులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మూడు రోజుల మురిపెం!

ఈ ప్రాంతంలో ఎవరైనా కొత్తగా పోలీస్ అధికారి వచ్చినప్పుడు డాం.. డూం అనడం ఆ తర్వాత షరా మామూలే అన్నట్లుగా మిన్నకుండి పోవడం పరిపాటిగా మారింది. ఆరు నెలల క్రితం కొత్తగా వచ్చిన ఓ పోలీస్ అధికారి తమ పరిధిలో ఒక్క బెల్టుషాపు, మద్యం సిట్టింగులు నిర్వహించే దాబా హోటళ్లు లేదంటూ హెచ్చరించారు. స్వయంగా వెళ్లి కొన్నింటిని బంద్ చేయించారు. దీంతో మిగతా అన్ని దాబా హోటళ్లు మూతపడ్డాయి. అంతలోనే ఏమైందేమోగాని నాలుగు రోజుల వ్యవధిలోనే మళ్లీ తెరుచుకున్నాయి. బెల్టుషాపులు, దాబా హోటళ్లు పోలీస్, ఎక్సైజ్ అధికారులకు ఆదాయ వనరులుగా మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి

సరస్వతీ శిశుమందిర్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- సరస్వతీ శిశుమందిర్‌లో తరగతి గదుల నిర్మాణ పనులకు భూమిపూజ

కోరుట్ల రూరల్, డిసెంబర్ 26: విద్యార్థులు దేశభక్తితో పాటు సంస్కృతీసంప్రదాయాలను అలవర్చుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. మండలంలోని ఐలాపూర్ గ్రామంలో గల సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి బీఆర్‌ఎస్ రాజ్యసభ ఎంపీ రూ.7 లక్షలు మంజూరు చేశారు. కాగా, గురువారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి తరగతి గదుల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ, సరస్వతీ శిశుమందిర్‌లో విద్యతో పాటు దేశభక్తిని బోధిస్తూ సమాజ జాగృతానికి పాటుపడుతున్నారన్నారు. శిశుమందిరాల్లో విద్యనభ్యసించిన ఆనాటి విద్యార్థులు ఉన్నత స్థానాల్లో పేరుగడిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఉపాధ్యక్షుడు గట్ల అనంతస్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు బండి నరేశ్, నాయకులు పిడుగు సందయ్య, దీకొండ రాజనర్సయ్య, రామాగౌడ్, సుదర్శన్, ఇప్ప రాజేందర్, డాక్టర్ వేముల ప్రభాకర్, డాక్టర్ అన్వేష్, కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సరస్వతీ శిశుమందిర్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడిపూజకు హాజరైన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, తదితరులు

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

మారుతీనగర్, డిసెంబర్ 26: మెట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మహా పడిపూజను గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆలయ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో గూడెం గురుస్వామి వేదమంత్రోచ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు స్వగృహం నుంచి వివిధ రకాల పుష్పాలను ఆలయానికి తీసుకొచ్చి, అయ్యప్ప ఉత్సవమూర్తికి సమర్పించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు, తదితర పూజలు చేపట్టి, పదునెట్టాంబడి దీపాలను వెలిగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. కాగా, అయ్యప్ప మహాపడి పూజకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జగిత్యాల జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి, ప్రసాదం అందజేశారు. అనంతరం అయ్యప్ప దీక్షాపరులకు, భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

జగిత్యాల, డిసెంబర్ 26: జిల్లా కేంద్రంలో అయ్యప్ప జాతర, మండల పూజ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వాములు పులి వేషధారణలో నగర సంకీర్తన చేశారు. స్వామి వారి తిరు ఆభరణాలను భక్తమార్కండేయ ఆలయం నుంచి తీసుకువచ్చారు. ఆలయంలో స్వాములచే అభిషేకాలు, మాతలచే ఉదయం 10 గంటలకు కుంకుమ పూజ, అనంతరం పదునెట్టాంబడి పూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు, భక్తులకు అన్నదానం చేశారు.

ఆరోగ్య హబ్‌కు రక్తదాతలే కీలకం

జగిత్యాల రూరల్, డిసెంబర్ 26: ఆరోగ్య హబ్‌గా రూపాంతరం చెందుతున్న జగిత్యాల పట్టణంలో రక్తదాతలు చేసే రక్తమే కీలకమవుతుందని ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గురువారెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని ఐఎంఏ హాల్లో గురువారం ఐఎంఏ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ, నిష్ణాతులైన యువ వైద్యుల వైద్య సేవలతో జగిత్యాల పట్టణం ఆరోగ్య హబ్‌గా రూపాంతరం చెందుతున్నదన్నారు. ఈ శిబిరంలో వైద్యులు ఎన్నకుల రాము, వేణుబాబు, బీరెల్లి శ్రీనివాస్ రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుదీర్‌కుమార్, బ్లడ్‌బ్యాంక్ వైద్యుడు డాక్టర్ రఘుపతిరావు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

కోరుట్ల, డిసెంబర్ 26: పట్టణంలోని అంబేద్కర్ భవనంలో శుక్రవారం మాదిగ కళాకారుల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు మహా ప్రదర్శన కమిటీ జిల్లా అధ్యక్షుడు మారంపల్లి శ్రీధర్ తెలిపారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల లక్ష డప్పులు, వెయ్యి గొంతుల భారీ ప్రదర్శనపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మాదిగ కళాకారులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు శంకర్, రాజశేఖర్, వినోద్, మహేశ్, కిరణ్, నితీన్, వంశీ, అభిషేక్, శంకర్, నరేశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప జాతర ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ

కోరుట్ల, డిసెంబర్ 26: పట్టణంలోని అయ్యప్ప, జ్ఞాన సరస్వతీ ఆలయంలో శుక్రవారం నిర్వహించే అయ్యప్ప జాతర ఏర్పాట్లను మెట్‌పల్లి డీఎస్పీ రాములు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పేద యువతి వివాహానికి చేయూత

నగదు అంజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మేడిపల్లి, డిసెంబర్ 26: భీమారం మండలం గోవిందారం గ్రామానికి చెందిన రుద్రంగి స్వామి కూతురు సౌమ్య వివాహానికి గురువారం బీఆర్‌ఎస్ నాయకులు రూ. 10 వేల నగదు అందజేశారు. ఆర్థిక సాయం చేసిన మాజీ జడ్పీటీసీ నెల్లుట్ల పూర్ణిమ, ప్రభాకర్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు ఈరవేణి గంగాధర్, చీటి దిలీప్‌రావు, చీటి సతీశ్‌రావు, వుడుతలపెల్లి సురేశ్‌రావు, పరమేశ్వర్‌రావు, బందెల రాజుకు సౌమ్య కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లచ్చయ్య, శ్రీనివాస్, నర్సయ్య, బుచ్చిరాజం, పోసయ్య, రాజం, మణి, గంగారాజం, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కారు పార్కు చేసినందుకు భార్యాభర్తలపై దాడి

బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

కోరుట్ల, డిసెంబర్ 26: రహదారి పక్కన కారు పార్కింగ్ చేసిన భార్యాభర్తలపై దాడి చేసిన ఘటన కోరుట్లలో సంచలనం రేపింది. బాధితుడి కథనం ప్రకారం.. చందుర్తి మండలం లింగంపేటకు చెందిన దేవరాజు బుధవారం రాత్రి తన భార్య లాస్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి కోరుట్లలోని తన అత్తగారింటికి కారులో వెళ్తున్నాడు. మార్గమధ్యంలో పట్టణంలోని తాండ్ర్యాల ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద మార్కెట్‌లో కూరగాయలు కొనేందుకు రోడ్డు పక్కన కారు పార్కు చేసి వెళ్లాడు. కూరగాయలు కొని తిరిగి వెళ్తుండగా అకస్మాత్తుగా అక్కడికి చేరుకున్న ముగ్గురు వ్యక్తులు దేవదాసుపై దాడి చేశారు. తమ దుకాణం పక్కన 'కారు ఆపుతావా..' అంటూ పిడిగుద్దులు గుద్దారు. గమనించిన అతని భార్య వారించే ప్రయత్నం చేయగా ఆమెపై దాడి చేసి గాయపర్చారు. కారు వెనుక సీటులో కూర్చున్న ఇద్దరు కూతుళ్లపై చేయి చేసుకున్నారు. కారు వెనుక అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో భయభ్రాంతులకు గురైన దేవదాసు భార్య సమీపంలోనే ఉన్న పోలీస్ స్టేషన్‌కు పరుగెత్తుకుంటూ వెళ్లి రోదిస్తూ విషయం చెప్పింది. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గొడవకు కారణాలు తెలుసుకున్నారు. దేవరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ శత ఆవిర్భావ వేడుకలు

జగిత్యాల, డిసెంబర్ 26: జగిత్యాలలోని టవర్ సర్కిల్‌లో సీపీఐ శత ఆవిర్భావ ఉత్సవాలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కామ్రేడ్ అనసూయ, సీనియర్ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్, నాయకులు వెన్న మహేశ్, శ్రీ గాద దేవదాసు, మాడిశెట్టి కిరణ్, ఎండీ అక్రం, ఎండీ చాంద్ ఖాన్, ఓంకార్, ఆసీఫ్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల, డిసెంబర్ 26: పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో సీపీఐ జెండాను పార్టీ జిల్లా నాయకుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మౌలానా, ముక్రం, ఉస్మాన్, రాధ, రాంబాబు, మహేశ్, గంగాధర్, రమేశ్, వంశీకృష్ణ, సమీర్, పోశెట్టి, మనోహర్, చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయానికి వీల్ చైర్లు అందజేత

మల్యాల, డిసెంబర్ 26: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానానికి వచ్చే దివ్యాంగ భక్తుల సౌకర్యార్థం కరీంనగర్‌కు చెందిన గూడ హర్షిత్‌రెడ్డి (అమెరికా) సహకారంతో కరీంనగర్‌కు చెందిన లయన్స్ క్లబ్ సభ్యులు ఆరు వీల్ చైర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు నీల చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు ధర్మేందర్, రాజేందర్‌రెడ్డి, ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి, అర్చకులు రామచంద్రప్రసాద్, పవన్‌కుమార్, లయన్స్‌క్లబ్ సభ్యులు చిదుర సురేశ్, ముక్క శరత్‌కృష్ణ, మ్యాడం శివకాంత్, కొండ రాంబాబు, రాజేందర్, వేణు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

యాదవుల చైతన్యానికి కృషి చేయాలి

ధర్మపురి, డిసెంబర్ 26: జిల్లాలోని యాదవులను చైతన్య పరచడానికి యాదవ విద్యావంతులు, మేధావులు కృషి చేయాలని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ కోరారు. బుగ్గారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో యాదవ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యత్వాలను స్వీకరించారు. యాదవ సంఘం అడహక్ కమిటీ మండల ఇన్‌చార్జులుగా వినోద్‌యాదవ్, జగన్‌యాదవ్, రాజేందర్‌యాదవ్‌ను నియమించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సర్వం సిద్ధం

జగిత్యాల, డిసెంబర్ 26: జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో శుక్రవారం నుంచి నిర్వహించే సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి జనవరి 2వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

సీనియర్ సిటీజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మాస పత్రికను ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, తదితరులు

కోరుట్ల, డిసెంబర్ 26: సీనియర్ సిటీజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని జీఎస్ గార్డెన్‌లో గురువారం జరిగిన ఓ శుభకార్యానికి హాజరైన ఆయన సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ముద్రించిన సీనియర్ సిటీజన్స్ పిలుపు మాస పత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్స్ ద్వారా వృద్ధాప్యంలో ఆదరణకు గురైన తల్లిదండ్రుల కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు హన్మంతరెడ్డి, యాకూబ్, శివానందం, రాజ్ మోహన్, ప్రభాకర్, నాగేందర్‌రెడ్డి, మహమూద్ తదితరులున్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ టోర్నీ విజేత పెగ్గెర్ల జట్టు

విజేత జట్టుతో ఎస్ఐ నవీన్‌కుమార్, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

కథలాపూర్, డిసెంబర్ 26: పెగ్గెర్ల గ్రామంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాస్థాయి కబడ్డీ టోర్నీ నిర్వహించారు. ఈ టోర్నీలో కథలాపూర్ మండలం పెగ్గెర్ల జట్టు (ప్రథమ), ధర్మపురి మండలం రాయపల్లి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నవీన్‌కుమార్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి రఘుపతి, ప్రతినిధులు రాజు, భాస్కర్, మండల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

వెల్గటూర్, డిసెంబర్ 26: ఎండపల్లి మండలం గుల్లకోట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జైనపురం వంశీ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. కాగా, ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరిగే 56వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. వంశీని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, శ్రీను, సాయికుమార్, గ్రామస్తులు అభినందించారు.

శ్రీ రామ మందిరము (శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయము) దేవాదాయ–ధర్మదాయ శాఖ జగిత్యాల పట్టణం & జిల్లా
లేఖ సంఖ్య: యస్.ఆర్.యం/2024 టెండరు ప్రకటన తేది: 26-12-2024
ఇందుమూలముగా సమస్త పట్టణ ప్రజలకు భక్తులకు మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయము, విద్యానగర్(ఎర్ర అంగడి) జగిత్యాల నందు మూడు (3) సంవత్సరముల పాటు అనగా తేది: 01-01-2025 నుండి 31-12-2027 వరకు కొబ్బరి కాయలు, కిరాణం, కూల్ డ్రింక్స్, పూజా సామాను అమ్ముకొనుటకు గాను బహిరంగ వేలము తేది: 28-12-2024 శనివారం రోజున ఉదయం, 11.00 గం||లకు దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించబడును.
కావున ఆసక్తి కలవారు ముందుగా రూ|| 10,000/- (అక్షరాల పదివేల రూపాయలు) మాత్రమే డిపాజిట్ చెల్లించి వేలములో పాల్గొనవలెను. వేలం షరతులు వేలం సమయం నందు తెలియజేయబడును. మరియు దుకాణం షెడ్డును తమ స్వంత ఖర్చులతో నిర్మాణం చేసుకొనవలెను. మరియు 3 సంవత్సరముల తరువాత షెడ్డు దేవాలయమునకే ఇవ్వవలెను. అట్టి షరతు ప్రకారమే వేలమునందు పాల్గొనవలెను.
సహాయ కమీషనర్, దేవాదాయ శాఖ, కరీంనగర్ సం/- కార్యనిర్వహణాధికారి

లోక్‌సత్తా మాజీ అధ్యక్షుడి మృతి

పెగడపల్లి, డిసెంబర్ 26: మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, లోక్ సత్తా మాజీ మండలాధ్యక్షుడు కాటం జలపతిరెడ్డి (80) గురువారం మృతి చెందాడు. జలపతిరెడ్డి మృతికి పలువురు సామాజిక వేత్తలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, మండల ప్రజలు సంతాపం తెలిపారు.

30న వేలం పాట

సారంగాపూర్, డిసెంబర్ 26: పెంబట్లలోని దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతర ఉత్సవాల్లో కొబ్బరి కాయలు, బెల్లం, పూజా సామగ్రి అమ్ముకునే హక్కు, తలనీలాలు పోగు చేసుకునే హక్కు, పూలు, పూల దండలు, పండ్లు, ఆట బొమ్మలు, గాజులు అమ్ముకునే హక్కు, పాదరక్షలు భద్రపరిచే హక్కు కోసం ఈనెల 30 ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అనూష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో దుకాణాలు దక్కించుకున్న వారు ఫిబ్రవరి ఒకటి 2025 నుంచి జనవరి 31, 2026 వరకు నిర్వహించుకునే హక్కు ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శిగా లచ్చయ్య

లచ్చయ్యకు నియామక పత్రం ఇస్తున్న సంఘం రాష్ట్ర శాశ్వత అధ్యక్షుడు విజయభాస్కర్

కథలాపూర్, డిసెంబర్ 26: ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన రెండ్ల లచ్చయ్య పటేల్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర శాశ్వత అధ్యక్షుడు కొత్త విజయభాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లచ్చయ్య జిల్లా, మండల స్థాయిలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేయడంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర నాయకులకు లచ్చయ్య కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కథలాపూర్, డిసెంబర్ 26: మండలంలో 113 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా ప్రోత్సాహకం మంజూరైనట్లు తహసీల్దార్ వినోద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కథలాపూర్‌లోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ శాఖ ప్రారంభం

యూనియన్ బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న బ్యాంక్ రీజియన్ హెడ్ అరుణ సాదితా

సారంగాపూర్, డిసెంబర్ 26: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో యూనియన్ బ్యాంక్ శాఖను గురువారం బ్యాంక్ రీజియన్ హెడ్ అరుణ సాదితా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో ఇప్పటి వరకు యూనియన్ బ్యాంక్ 19 శాఖలతో రూ. 4వేల కోట్ల వ్యాపారం చేపడుతున్నట్లు తెలిపారు. తుంగూర్‌లో ఏర్పాటు చేసిన శాఖతో 20కి చేరిందన్నారు. యూనియన్ బ్యాంక్ సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామకుమార్, బ్యాంక్ మేనేజర్ రవికుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతు వేదిక భవనం

నిరుపయోగంగా ఉన్న రైతు వేదిక భవనం

పెగడపల్లి, డిసెంబర్ 26: పెగడపల్లి మండలం నందగిరి రైతు వేదిక భవనం నిరుపయోగంగా మారింది. పంట సాగులో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి మండలంలో వ్యవసాయ క్లస్టర్ల వారీగా రైతు వేదిక భవనాలను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చింది. కాగా, నందగిరి రైతు వేదికను వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఈ భవనంలోని కుర్చీలు, ఇతర ఫర్నీచర్ దొంగలు ఎత్తుకెళ్లారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి రైతు వేదిక భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

జగిత్యాల వాసికి పురస్కారం

అవార్డు అందుకుంటున్న స్వప్న

జగిత్యాల, డిసెంబర్ 26: హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో మానేపల్లి జ్యువెలర్స్, వారాహి సిల్క్స్, ఇమ్మడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగిత్యాలకు చెందిన సామాజికవేత్త బీరెల్లి స్వప్నకు మోస్ట్ పాపులర్ వైశ్య ఉమెన్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బీరెల్లి స్వప్న మాట్లాడుతూ, తనకు పురస్కారం అందించిన మానేపల్లి జ్యువెలర్స్, వారాహి సిల్క్స్, ఇమ్మడ్డి ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ధర్నాకు తరలివెళ్లిన టీపీటీఎఫ్ నాయకులు

జగిత్యాల, డిసెంబర్ 26: సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు జగిత్యాల జిల్లా టీపీటీఎఫ్ నాయకులు, సమగ్ర శిక్షా ఉద్యోగులు తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో టీపీటీఎఫ్ నాయకులు బోగ రమేశ్, కొక్కుల రాంచంద్రం, ఎడ్ల గోవర్ధన్, గొడుగు రఘుపతి యాదవ్, కల్పన, కూరగాయల చంద్రశేఖర్, వేముల సుధాకర్, సమగ్ర శిక్షా ఉద్యోగులు బర్ల నారాయణ, ఎన్ అంజయ్య, శ్రీనివాస్, సురేశ్, ప్రవీణ్, సత్యం, రమేశ్, భానుప్రియ, విజయలక్ష్మి, అనూష, అనిత, అలేఖ్య తదితరులున్నారు.

ధర్నాకు తరలివెళ్తున్న నాయకులు